క్లుప్తంగా

ప్రవక్త జీవితం యువతకు ఆదర్శం



అంధుల పాఠశాలలో అన్నదానం చేస్తున్న ఐవైఎం సభ్యులు

మండపేట: మహ్మద్ ప్రవక్త జీవితం యువతకు ఆదర్శనీయమని ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ (ఐవైఎం) పట్టణ శాఖ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ అన్నారు. యువతలో సేవాభావాన్ని పెంపొందించి సన్మార్గంలో నడిపించడమే లక్ష్యంగా తమ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ నుంచి 30 వరకు ప్రవక్త మహమ్మద్ యువతరానికి స్ఫూర్తి అనే నినాదంతో ఐవైఎం రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక అంధుల పాఠశాలలోని విద్యార్థులకు ఐవైఎం సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సభ్యులు జాబిర్, రెహ్మాన్, మున్నా, రహీం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవ ప్రత్యేక పారిశుధ్య పనులు



అంగర దుకాణదారుడికి కరపత్రాన్ని అందజేస్తున్న ఎంపీటీసీ అద్దాల శ్రీనివాస్

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేయాలంటూ దుకాణదారులకు నోటీసులు, కరపత్రాలను అందజేశారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణ విఘాతానికి కారణమయ్యే తీరును వివరించారు. అంగర, పడమర ఖండ్రిక, వల్లూరు, నేలటూరు తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణలో పారిశుధ్య కార్మికులు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం



అక్రమ మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

రామచంద్రపురం: రామచంద్రపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది జూన్ నెల నుంచి జూలై నెలాఖరు వరకు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం సీసాలను మంగళవారం స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌లో ధ్వంసం చేశారు. రామచంద్రపురంలో అడిషనల్ అడ్మిన్ ఎస్పీ ఖాదర్‌బాషా, అమలాపురం ఇంచార్జ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శివరామరాజు ఆధ్వర్యంలో పట్టుబడిన 1143 సీసాల అక్రమ మద్యం ధ్వంసం చేశారు. ధ్వంసం చేసిన మద్యం విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ వి.రామకృష్ణ, ఎస్ఐ రవికుమార్, వార్డ్ అడ్మిన్ సెక్రటరీ కాకినాడ మాచరయ్య, 9వ వార్డ్ మహిళా పోలీసు టేకుమూడి కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

నేడు పర్యాటక దినోత్సవ కార్యక్రమం

రామచంద్రపురం రూరల్: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని నేడు ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు జిల్లా టూరిజం శాఖ అధికారి పి.వెంకటాచలం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రార్థన ఆలయ ప్రాంగణం, ఆలయ పరిసరాలను శుభ్రపరచడం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కోనసీమ జిల్లా టూరిజం అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులకు అవగాహన కల్పించండి

కాజులూరు: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఎలుకల మందు పంపిణీపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని మండల వ్యవసాయాధికారి(ఏవో) వి.అశోక్ కోరారు. మంగళవారం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో జరిగిన వీఏఏల సమావేశంలో ఏవో అశోక్ మాట్లాడుతూ కాజులూరు మండల గ్రామాల్లో ప్రస్తుతం వరి పంటపై ఎలుకల బెడద ఎక్కువగా ఉందని అన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సామూహిక ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా సరఫరా చేస్తుందని కాజులూరు మండలానికి 84 కేజీల మందు విడుదలయిందన్నారు. ఈ మందును ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మందు ఎరను తయారు చేసుకునే విషయంపై ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

మారనున్న పట్టణ రూపురేఖలు

- 20 ఏళ్ల ముందు చూపు
- మాస్టర్ టౌన్ ప్లాన్‌కు డ్రాఫ్టింగ్ పూర్తి
- త్వరలో కౌన్సిల్ ఆమోదానికి



రామచంద్రపురం ప్రధాన రహదారి

రామచంద్రపురం: మున్సిపాలిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. గ్రామాలతో పాటుగా ముందుచూపుగా 20 ఏళ్ల వరకు పట్టణాలు ఎలా ఉంటాయనే దానిని అంచనా వేస్తూ రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా మున్సిపాలిటీ మాస్టర్ టౌన్ ప్లానింగ్‌కు అధికారులు డ్రాఫ్టింగ్‌ను పూర్తి చేశారు.

మారనున్న పట్టణ స్వరూపం

రానున్న 20 ఏళ్ల వరకు పట్టణం ఏలా ఉండాలనే దానిపై అధికారులు ప్రణాళికలను రూపొందించారు. గతంలో 2002లో మున్సిపాలిటీ మాస్టర్ టౌన్ ప్లానింగ్‌కు అప్పటి కౌన్సిల్ ఆమోదం తెలపగా అప్పటి ప్రభుత్వం దీనికి ఆమోదముద్ర వేసింది. తదనంతరం ఇరవై రెండేళ్ల తరువాత తిరిగి మాస్టర్ ప్లానింగ్‌కు ప్రభుత్వం ఆదేశాలను జారీ చేయటంతో మాస్టర్ టౌన్‌ప్లానింగ్‌కు అధికారులు రూపకల్పన చేశారు. దీని ప్రకారం ప్రధానంగా మెయిన్ రోడ్లు, మున్సిపాలిటీలోని కాలనీల రోడ్లు డ్రైనేజీల వంటి వాటిని విస్తరించనున్నారు. లేఅవుట్ల స్వరూపాలు, గృహ, వాణిజ్య ప్రాంతాల ఏర్పాటు వంటివి పట్టణంలో ఎలా ఉండేలనే దానిపై ప్లానింగ్‌ను తీర్చిదిద్దనున్నారు. మొత్తంగా పట్టణ స్వరూపం రాబోయే 20 ఏళ్ల తరువాత కూడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండే విధంగా మాస్టర్ టౌన్‌ప్లానింగ్ ద్వారా ప్రణాళికలు రూపొందించారు.

విస్తరించనున్న రహదారులు

ప్రస్తుతం రామచంద్రపురం పట్టణంలోని ప్రధాన రహదారులు 60 అడుగుల రోడ్డుగా ఉంది. పక్కా రహదారులు 20 నుంచి 30 అడుగుల రోడ్లుగా ఉన్నాయి. పెరుగుతున్న తీవ్రమైన ట్రాఫిక్‌తో పట్టణంలోని ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రానున్న 20 ఏళ్లలో ట్రాఫిక్ మరింతగా పెరిగే అవకాశం ఉంది. అయితే మాస్టర్ టౌన్ ప్లానింగ్‌లో భాగంగా ప్రధాన రహదారితో పాటుగా సైడ్ రోడ్లను కూడా విస్తరించనున్నారు. ప్రధాన రహదారిని ఇప్పుడున్న 60 అడుగుల రోడ్డును 80 నుంచి 120 అడుగుల వరకు పెంచే అవకాశం ఉంది. అలాగే పక్క రహదారులను 40 అడుగుల నుంచి 60 అడుగుల రహదారిగా మారుతాయి. ఈ మేరకు మాస్టర్ టౌన్‌ప్లాన్‌లో మార్పులు జరుగుతాయి.

ఇండస్ట్రియల్ ఏరియాల ఏర్పాటు

పట్టణం విస్తరణ దృష్ట్యా రాబోయే కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏరియాల వారీగా ప్రదేశాలను కేటాయిస్తారు. ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ ఏరియాలను ఏర్పాటు చేసి పట్టణ అభివృద్ధికి ప్రత్యేకంగా స్థలాలను కేటాయిస్తారు. దీంతో మున్సిపాలిటీలో పారిశ్రామిక రంగం అభివృద్ధికి దోహదపడుతుంది.

లేఅవుట్లకు ప్రత్యేక మార్గదర్శకాలు

పట్టణ పరిధిలో నూతనంగా వెలిసే లేఅవుట్లను ప్రత్యేక మార్గదర్శకాలను మున్సిపాలిటీ విడుదల చేస్తుంది. భవిష్యత్‌లో అవసరమైన స్థలాల ఏర్పాటుకు లేఅవుట్‌లకు ప్రభుత్వం ఇప్పటి నుంచి మార్గదర్శకాలను నిర్దేశించి దాని ప్రకారం అమలు చేస్తుంది. తాగునీటి సౌకర్యాలు డ్రైనేజీ వ్యవస్థతో పాటు విశాలమైన రోడ్ల ఏర్పాటును కచ్చితంగా పాటించాలని సూచిస్తారు. ఈ మేరకు తదుపరి మార్గదర్శకాలను, ప్రణాళికలను రూపొందించాలని మున్సిపల్ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

డ్రాఫ్ట్ తయారు చేశాం



20 ఏళ్లకు ఒక సారి మున్సిపాలిటీ స్వరూప స్వభావాలను మార్చేందుకు మాస్టర్ ప్లాన్‌ను తయారు చేస్తారు. గతంలో 2002లో రామచంద్రపురం టౌన్ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. తిరిగి ఇప్పుడు ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళికను సిద్ధం చేశాం. అందులో భాగంగానే డ్రాఫ్ట్‌ను తయారు చేశాం. ఈ మేరకు త్వరలోనే కౌన్సిల్ ముందుకు తీసుకువస్తాము.

– టి.శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రామచంద్రపురం

ఆమోదం అభినందనీయం



పట్టణ రూపురేఖలు మార్చేందుకు మాస్టర్ టౌన్ ప్లానింగ్‌కు ప్రభుత్వం చర్యలు తీసుకోవటం అభినందనీయం. మా కౌన్సిల్ సమయంలో మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధి చెందడం మంచి పరిణామం.

– గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ చైర్‌పర్సన్, రామచంద్రపురం

పట్టణాభివృద్ధికి పాటుపడాలి



చైర్‌పర్సన్ దుర్గారాణిని కలిసిన డీఈ శ్రీనివాస్

మండపేట: ఇంజినీరింగ్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులను వేగవంతం చేయడం ద్వారా పట్టణాభివృద్ధికి పాటు పడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. మండపేట మున్సిపల్ డీఈగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన కె శ్రీనివాస్ చైర్‌పర్సన్ దుర్గారాణిని ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. కాగా శ్రీనివాస్ గతంలో ఇక్కడ ఏఈగా పనిచేసి సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు.

వేంకటేశుని జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని అలివేలు మంగ, గోదాదేవీ సమేత వైభవ వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్ర పూజలను మంగళవారం ఆలయంలో నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు బాలబాలాజీ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం పూజలు చేయనున్నారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జన కేంద్రాలుగా స్కూల్ కాంప్లెక్స్‌లు



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో నరసింహ ఫణి

రాయవరం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులు తమ అనుభవాలు ఇతరులకు పంచే విధంగా ఉండాలని రామచంద్రపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎస్.ఎల్.నరసింహఫణి అన్నారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల, ఇంగ్లిష్ సబ్జెక్టు ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశాలను ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం నరసింహఫణి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జ్ఞాన సముపార్జన కేంద్రాలుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు తమ బోధనా సామర్థ్యాలను మెరుగుపరుచుకునేలా కాంప్లెక్స్ సమావేశాలను తీర్చిదిద్దామన్నారు. గతంలో జరిగే సమావేశాలకు భిన్నంగా లైవ్ సెషన్స్ ఆన్‌లైన్‌లో ప్రసారం చేస్తున్నట్టు తెలిపారు. లైవ్ సెషన్స్‌ను ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకుని, బోధనా సామర్థ్యలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా ఉన్నప్పుడే మెరుగైన బోధనా పటిమను కలిగి ఉంటారన్నారు. పాఠశాలల్లో బోధనా సమయంలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను వినియోగించాలని, టీఎల్ఎంతో తరగతి గదిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు బోధనలో వినియోగించే ఇన్నోవేటివ్ పద్ధతులను కాంప్లెక్స్ సమావేశాల్లో వివరించడం ద్వారా మిగిలిన ఉపాధ్యాయులు ఆ ఇన్నోవేటివ్ పద్ధతులను బోధనలో అన్వయించుకునే వీలుంటుందన్నారు. మారుతున్న కాలానుగుణంగా బోధనా పద్ధతులను మార్చుకుంటేనే ఉపాధ్యాయుడు సమర్థవంతంగా బోధన చేయగలరన్నారు. సమావేశంలో ఎంఈవోలు పి.లక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, కాంప్లెక్స్ హెచ్ఎం సునీత, కాంప్లెక్స్ సెక్రటరీలు పాల్గొన్నారు.

బీసీ గణనపై అసెంబ్లీలో బిల్లు



రామచంద్రపురంలో సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న బీసీ నేతలు

రామచంద్రపురం: గత కొన్నేళ్లుగా బీసీల సంఖ్యపై గణనను ఆయా వర్గాలు కోరుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం మేరకు రాష్ట్రంలో బీసీ గణనను చేపట్టేందుకు అసెంబ్లీలో బీసీ గణన బిల్లును స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రవేశపెట్టడం చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ, ఎంపీపీ పంపన నాగమణి, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, కొప్పిశెట్టి లక్ష్మణ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాకతీయ రాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. బీసీ గణనపై మంత్రి వేణు అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ నియోజకవర్గానికి చెందిన బీసీ నేతలు, ప్రజా ప్రతినిధులు పట్టణంలోని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సమాజంలో బలహీన వర్గాలుగా పరిగణించబడుతున్న వెనుకబడిన తరగతులను సమాజానికి వెన్నెముకగా సీఎం జగన్ గుర్తించారన్నారు. వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. దాదాపు శతాబ్ద కాలంగా కులగణన చేయకపోవడంతో అభివృద్ధి ఫలాలను అందుకోవలసినంతగా అందుకోలేక పోయామని, అభివృద్ధిలో వెనకబడ్డామని భావిస్తున్న వెనుకబడిన తరగతుల వారి నుంచి కులగణన చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా వస్తుందన్నారు. గత ప్రభుత్వాలు దీన్ని పెడచెవిన పెట్టాయని బీసీల డిమాండు సహేతుకమైనదని భావించిన సీఎం జగన్ ప్రభుత్వం కులగణన దిశగా ముందడుగు వేయటం అభినందనీయమన్నారు. కుల గణన కోసం, ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిన గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా గణనకు వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొనసా కామేశ్వరరావు, ద్రాక్షారామ అధ్యక్షుడు కొనసా భీమశంకరం, దార్ల శ్రీను, కాజులూరు మండల పార్టీ నేత గుబ్బల ఏసురాజు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఉప్పు రాజు, సర్పంచ్‌లు వాసంశెట్టి సూరిబాబు, నక్కిన దొరబాబు, ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి వైఎస్సార్ సీపీ నేతలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ స్థల సర్వే పనుల పరిశీలన



సర్వే పనులపై తహసీల్దార్ రాజేశ్వరరావుతో చర్చిస్తున్న వెంకన్నబాబు, ఎంపీపీ శ్రీనివాస్

మండపేట: మండలంలోని కేశవరంలో రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణానికి సంబంధించి జరుగుతున్న స్థల సర్వే పనులను మంగళవారం తహసీల్దార్ టీఆర్ రాజేశ్వరరావు పరిశీలించారు. సర్వే పనుల ప్రగతిపై వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్‌లతో చర్చించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు సర్వే పనులు శరవేగంగా చేస్తున్నామన్నారు. ఫ్లై ఓవర్ డిజైన్‌కు అనుగుణంగా సేకరించాల్సిన భూమిపై బుధవారం స్పష్టత వస్తుందని తహసీల్దార్ రాజేశ్వరరావు వివరించారు. సర్వే అనంతరం స్థల సేకరణపై ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామన్నారు.

తీరనున్న వెతలు

కేశవరం రైల్వేగేటు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ వెతలు తీరతాయని ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అన్నారు. దీర్ఘకాలం నాటి సమస్యకు ఎమ్మెల్సీ తోట చొరవతో త్వరలో తెరపడుతోందన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి చర్యలు చేపట్టిన ఎమ్మెల్సీ తోట, ఎంపీలు చింతా అనురాధ, మార్గాని భరత్‌రామ్‌లకు ఎంపీపీ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ వుండమట్ల నారాయణరావు, గనిశెట్టి సత్తిబాబు, కూసు అబ్బు, మాచిరెడ్డి సురేష్, చంద్రమళ్ల రవిశాస్త్రి, పోసుపో బుల్లిరాజు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



నేత్ర వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కె.గంగవరం: మండలంలోని శివల పంచాయతీ వద్ద మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ అనుసూరి సాయిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరంలో అమలాపురానికి చెందిన కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది గ్రామంలో సుమారు 100 మందికి ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు, ఆపరేషన్ అవసరమైన వారికి గుర్తించి ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు రోగులకు ఆసుపత్రికి తరలించారు. ఉప సర్పంచ్ సుబ్బా, సచివాలయ కన్వీనర్ రాజేంద్ర, తుకారం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా మేరా మాటి..మేరా దేశ్



చెల్లూరులో మేరా మాటి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీ

రాయవరం: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం మేరా మాటి..మేరా దేశ్ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. మండల విద్యాశాకాధికారులు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ పర్యవేక్షణలో ఉపాధ్యాయులు కార్యక్రమాలు చేపట్టారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ పిలుపు మేరకు విద్యాశాఖ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బ్రేవ్ హార్ట్స్ అండ్ పేట్రియాటిజమ్ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, స్టోరీ టెల్లింగ్, పాటలు, స్కిట్స్, రంగోళి, ఫ్యాన్సీడ్రెస్ పోటీలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు జాతీయ నాయకుల చిత్రాలు, జాతీయ జెండాలను చేతబూని పాఠశాల ఆవరణ, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మేరి మిట్టి..మేరా దేశ్ బ్యానర్స్‌ను పట్టుకుని విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయులు కలశంలో మట్టిని సేకరించడంతో పాటుగా, పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ కార్యక్రమాలను పాఠశాలల్లో కొనసాగించడంతో పాటుగా ఆ ఫొటోలు, వీడియోలను ఉపాధ్యాయులు వెబ్ లింక్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



ద్రాక్షారామలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న గణపతి నవరాత్రుల్లో భాగంగా మంగళవారం కమిటీ ఆధ్వర్యంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సౌమిత్ర సర్వే తీరును పరిశీలించిన డీపీఓ




కందులపాలెంలో సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీపీఓ కృష్ణకుమారి

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలోని ఓదూరు, కందులపాలెం, వేగాయమ్మపేట గ్రామాల్లో సౌమిత్ర సర్వే జరుగుతున్న తీరును డీపీఓ కృష్ణకుమారి రామచంద్రపురం ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజుతో కలసి మంగళవారం పరిశీలించారు. గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్ పనితీరు, క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతున్న సిబ్బంది పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు వింజుమళ్ల విమలకుమారి, పెంకే కృష్ణవేణి, అంబటి తుకారం, పంచాయతీ కార్యదర్శులు కేవీ శ్రీనివాస్, సీహెచ్ భాస్కరలక్ష్మి, నారాయణాచార్యులు పాల్గొన్నారు. కందులపాలెంలో గ్రామ సర్పంచ్ పెంకే కృష్ణవేణి, వీరరాఘవులు దంపతులు డీపీఓను పూలమాలతో సత్కరించారు.

నేడు కోటిపల్లి ఫెర్రీ జాయింట్ కమిటీ ఏర్పాటు

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలోని ఫెర్రీకి జాయింట్ కమిటీని నేడు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెర్రీకి జాయింట్ కమిటీ ఏర్పాటు చేయాలని 2000లో పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఇచ్చారని అనివార్య కారణాలతో ఇప్పటి వరకు కమిటీ వేయలేదన్నారు. ప్రస్తుతం జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆదేశాల మేరకు కమిటీని ఏర్పాటు చేస్తున్నామని దీనిలో కమిటీ అధ్యక్షులుగా ఎంపీపీ, సభ్యులుగా జెడ్పీటీసీ, డివిజనల్ పంచాయతీ అధికారి ఉంటారని పేర్కొన్నారు. నేడు మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ ఏర్పాటు చేసి సమావేశం నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర గౌరవ సలహాదారుగా దొరబాబు



మోర్త దొరబాబు

కె.గంగవరం: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) గౌరవ సలహాదారుగా దంగేరు గ్రామానికి చెందిన మోర్త దొరబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజీవ్ మాదిగ ప్రకటించారని దొరబాబు తెలిపారు. దొరబాబు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి అందరి మన్ననలను పొందుతానన్నారు. మాదిగ జాతి వారందరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

‘దొమ్మేటి’ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



దుగ్గుదుర్రులో వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాజులూరు: శెట్టిబలిజ సంఘం నాయకుడు దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలను బీసీ యువకులు ఆదర్శంగా తీసుకోవాలని అమలాపురం పార్లమెంట్ శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ కడలి రాంపండు అన్నారు. మంగళవారం శెట్టిబలిజ సంఘం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని దుగ్గుదుర్రులో సంఘం వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాంపండు మాట్లాడుతూ ఆనాటి కాలంలోనే కోనసీమ నుంచి బర్మా దేశం రంగూన్‌కు వ్యాపారాలకు వెళ్లి అక్కడ మేయర్ పదవి చేపట్టిన వెంకటరెడ్డి కోనసీమ శెట్టిబలిజల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సంక్షేమ సంఘం నాయకులు మేడిశెట్టి ఇజ్రాయిల్, పెంకే భీమన్న, కడలి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని యనమదల, ద్రాక్షారామ, వెల్ల, తాడిపల్లి, చోడవరం, తోటపేట, వెలంపాలెం, బాపనయ్యచెరువు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులు భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఏఓ చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలు బుధవారం కూడా కొనసాగుతాయని మంగళవారం హాజరు కాని అభ్యర్థులు పాల్గొనాలని సూచించారు.